సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 19 । జూలై । 2024



హాస్టల్ భోజనంలో పురుగు

తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్ భోజనంలో పురుగు రావడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸



ఎస్సారెస్పీలోకి భారీ ఇన్‌ఫ్లో

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 26వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.2 /23.3

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర బదిలీ

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్య శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగా నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆమె ఇక్కడ ఏడేళ్లుగా ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించారు. అంతకు ముందు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.

జీజీహెచ్ ప్రొఫెసర్లు సైతం..

బదిలీల్లో భాగంగా పలువురు ప్రొఫెసర్లకు స్థానచలనం కల్పించారు. అనస్తీయా ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ మాదాల, డాక్టర్ ఆర్ ఎంవో నరేంద్ర కుమార్, సర్జన్ డాక్టర్ సునీల్‌కుమార్, అనటమీ ప్రొఫెసర్ సుధాకర్ బాబు, పాథాలజీ ప్రొఫెసర్ నాగార్జున చారి, ఆర్థో విభాగానికి చెందిన ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు, ప్రొఫెసర్ శ్రీనివాస్ బదిలీ అయ్యారు. పీడియాట్రిషన్లు గోపాల్ సింగ్, కవితలకు కూడా స్థానచలనం కలిగింది. వీరితో పాటు కిందిస్థాయిలో మరికొంతమంది బదిలీలు జరిగాయి.

ఇద్దరు డిప్యూటీ డీఎంహెచ్‌వోలకు..

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఇద్దరు డిప్యూటీ డీఎంహెచ్‌వోలకు బదిలీ జరిగింది. ఇందులో భాగంగా ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న రమేశ్‌కు పోచంపాడ్‌లోని డ్యాం సైట్ ఆస్పత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా స్థానచలనం కలిగింది. పోచంపాడ్ డ్యాం సైట్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న తుకారాం రాథోడ్ ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బదిలీ అయ్యారు. ఆయన ప్రస్తుతం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా, నిజామాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో, మలేరియా అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కిందిస్థాయిలో మరికొంత మంది ఉద్యోగులకు బదిలీలు జరిగాయి.

మూడు శాఖల్లో..

సుభాష్ నగర్: జిల్లాలో రెవెన్యూ శాఖ, విద్యాశాఖ, వ్యవసాయ శాఖలో సాధారణ బదిలీల ప్రక్రియను గురువారం చేపట్టారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సమక్షంలో కౌన్సెలింగ్ కొనసాగింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలుగేళ్లు నిండిన వారిలో 40 శాతానికి మించకుండా బదిలీ చేశారు. రెవెన్యూ శాఖలో 20 మంది సీనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు చొప్పున జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, ఆరుగురు డీటీలకు వారికి నచ్చిన చోట పోస్టింగులు ఇచ్చారు. వీరు ఈనెల 20 తర్వాత ఆయా చోట్ల బాధ్యతలు స్వీకరించనున్నారు.

బీట్ ఆఫీసర్ల ట్రాన్స్‌ఫర్స్ ప్రక్రియ పూర్తి



డొంకేశ్వర్(ఆర్మూర్): అటవీ శాఖలో బీట్ ఆఫీసర్లకు గురువారం బదిలీలు జరిగాయి. జిల్లా కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎఫ్‌వో వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో బీట్ ఆఫీసర్లకు కౌన్సెలింగ్ చేపట్టారు. మొత్తం 75 మంది ఉద్యోగులకు గాను 30 మందికి స్థానచలనం కలిగింది. అదే విధంగా జూనియర్ అసిసెట్లు, అటెండర్లకు కూడా బదిలీలు పూర్తి చేశారు. సెక్షన్ ఆఫీసర్లకు శుక్రవారం బాసర్ జోన్ సీసీఎఫ్ అధ్వర్యంలో నిర్మల్ జిల్లాలో జరగనున్నాయి.

నాగన్నగారి మెట్ల బావి పరిశీలన



లింగంపేట: మండల కేంద్రంలోని చారిత్రక కట్టడమైన నాగన్నగారి బావిని గురువారం కేంద్ర జలశక్తి అధికారి, కేంద్ర విద్యుత్ శాఖ డిప్యూటీ సెక్రెటరీ బెంజమిన్ కరుణాకరన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బావి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే చుట్టుపక్కల భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వ నిధులతో రోడ్డు నిర్మాణం, విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టి పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు మండల అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం ఆయన బావి పరిసరాల్లో మొక్కలు నాటారు. ఆయన వెంట పాటు కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ శాస్త్రవేత్త ఏఎస్ పవార్, ఎంపీడీవో నరేష్, ఏపీఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

రుణమాఫీ 226 కోట్లు


అట్టహాసంగా కార్యక్రమం ప్రారంభం

- ఏకకాలంలో మాఫీపై అన్నదాతల హర్షం
- వీసీలో రైతులతో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి
- వైఎస్సార్ మరో రూపంలో నిలబడ్డారన్న అన్నదాత రవి
- అంకాపూర్ చికెన్ తినిపిస్తారా అని అడిగిన ముఖ్యమంత్రి
- అంతకంటే భాగ్యమా అని సమాధానమిచ్చిన రైతు
- ఆసక్తికరంగా సాగిన సంభాషణ

జిల్లా వ్యాప్తంగా రైతు రుణమాఫీ సంబరాలు అంబరాన్నంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం రూ.లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేయడంతో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. సాయంత్రానికే రుణమాఫీ డబ్బులు ఖాతాల్లో పడ్డట్లుగా రైతుల సెల్‌ఫోన్లకు సందేశాలు వచ్చాయి. మెసేజ్‌లు చూసుకుని సంబురపడిపోయారు. సంతోషంతో స్వీట్లు పంచిపెట్టారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఉన్నప్పుడు పూర్తి రుణమాఫీ జరిగితే మళ్లీ ఇప్పుడే అదికూడా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని రైతులు పేర్కొన్నారు. మళ్లీ రాజన్న రాజ్యం వచ్చిందని కర్షక లోకం గుర్తుచేసుకుంది. అయితే జిల్లా వ్యాప్తంగా 44,469 మంది రైతులకు రూ.225.62 కోట్ల రుణమాఫీ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం 31 రైతు వేదికల్లో వేడుకలను నిర్వహించారు. – డొంకేశ్వర్



బోధన్‌లోని రైతు వేదికలో సీఎంతో మాట్లాడుతున్న రైతు రవి, పాల్గొన్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



Thursday, 18 July

Your CC A/c
*9604 Credited for
Rs.80097.00 on
18-07-2024 20:06:55
by NEFT/ PAY AND
ACCOUNTS OFF UTR:
RBI2012405060225
Avl Bal Rs.80137.57
8:07 pm

మాఫీ సొమ్ము జమ అయినట్లు రైతుకు వచ్చిన మెస్సేజ్

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన రైతు రుణమాఫీ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఏకకాలంలో రూ. 2 లక్షల పంట రుణమాఫీ చేయనుండడంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లువిరిశాయి. రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి గురువారం సాయంత్రం 4 గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం రైతులతో భేటీ అయ్యారు. ఇందులో భాగంగా బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గల రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సంకేత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ ఫెడరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజీద్ హుస్సేన్‌లు, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ ద్వారా రైతుల ఖాతాల్లో రూ. 31వేల కోట్లు జమ చేస్తున్నామని తెలిపారు. తొలుత లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేయడం ద్వారా గురువారం ఒక్క రోజే రాష్ట్ర వ్యాప్తంగా రూ. 6098 కోట్ల రూపాయల నిధులను రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేశామని వివరించారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలో రూ. 226 కోట్లు రుణమాఫీ కింద రైతుల అకౌంట్లలో పడ్డాయని సీఎం తెలిపారు. అన్నదాతకు మేలు చేకూర్చే అవకాశం లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని.. 16 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానంలో ఇదెంతో ప్రత్యేకమైన రోజు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. ఏకకాలంలో రుణమాఫీ అమలు చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్రం యావత్తు దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతును రాజు చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని సీఎం స్పష్టం చేశారు.

'ఎంతో సంతోషంగా ఉంది'

రుణమాఫీ అమలు కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆసక్తికరమైన చర్చ సాగింది. సాలూర మండలంలోని మందర్న గ్రామ రైతు రవి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ. 2 లక్షల పంట రుణాలు మాఫీ చేయడంతో రైతులు ఎంతో సంతోషపడుతున్నారని సీఎంకు తెలిపారు. వరి మడుల్లో రైతులు స్వీట్లు పంపిణీ చేసుకుని సంబరాలు జరుపుకుంటున్నారన్నారు. రుణమాఫీతో రైతుల్లో ఎనలేని భరోసా కలిగిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మరో రూపంలో మీరు రైతులకు రుణమాఫీ చేసి అండగా నిలబడ్డారన్నారు. ముఖ్య మంత్రి మాట్లాడుతూ మీ ఎమ్మెల్యే పెద్దాయ న సుదర్శన్ రెడ్డి ఉన్నారా అని సీఎం రైతును అడిగారు. పెద్దాయన ఆయనను బాగా చూసుకోవాలని సీఎం పేర్కొన్నారు. మీలాగే మా ఎమ్మెల్యే రైతు పక్షపాతి అని రైతు బదులిచ్చారు. 'మీకు రుణమాఫీ చేశామని.. అంకాపూర్ చికెన్ తినిపిస్తారా అని సీఎం కోరగా, అంతకంటే భాగ్యమా సార్ రైతు రవి సమాధానం ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి, రైతుకు మధ్య కొద్దిసేపు సాగిన సంభాషణను రైతు లు ఆసక్తిగా ఆలకించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రైతు వేదిక ఆవరణలో రైతులు, నాయకులు పెద్ద ఎత్తున టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.



రుద్రూర్ మండలం సత్యనారాయణపురం రైతు వేదికలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పోచారం, కాంగ్రెస్ నాయకులు

నియోజకవర్గాల వారీగా నిధుల వివరాలు..

నియోజకవర్గం	రైతులు	కుటుంబాలు	రుణమాఫీ (రూ.కోట్లలో)
ఆర్మూర్	5,736	5,447	30.27
బాల్కొండ	7,120	6,799	40.62
నిజామాబాద్ రూరల్	11,866	11,106	62.73
నిజామాబాద్ అర్బన్	112	109	0.42
బోధన్	12,026	11,043	55.18
బాన్సువాడ	7,609	6,970	36.40



బోధన్ పట్టణంలోని ఏఎంసీ ఆవరణలో గల రైతు వేదికలో రుణమాఫీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన రైతులు

రైతులకు స్వర్ణయుగం



ఖలీల్‌వాడి: కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయడం రైతులకు స్వర్ణయుగం. రైతులు తొమ్మిన్నర ఏళ్లుగా రుణమాఫీ కోసం ఎదురు చూశారు. మూడు విడతలలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తాం. రెండు సార్లు కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన రైతులకు రుణమాఫీ చేయలేదు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుంది. – మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటివ్ చైర్మన్

వైఎస్సార్ తరహాలో సీఎం రేవంత్‌రెడ్డి



వైఎస్సార్ తరహాలో సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేశారు. కాంగ్రెస్ రైతుల ప్రభుత్వం. రైతుల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ పని చేస్తుంది. మేనిఫెస్టోలో ప్రకటించినట్లు రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ అవుతాయి. రుణమాఫీతో రైతులు సంతోషంగా ఉన్నారు.

– ముప్పా గంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు

'రుణమాఫీ' రైతు చేతికి అందాలి

- బ్యాంకర్లకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పష్టీకరణ



మాట్లాడుతున్న కలెక్టర్

సుభాష్‌నగర్: రైతులకు లబ్ధి చేకూర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రుణమాఫీ పథకం డబ్బులు సంబంధిత రైతుల చేతికి అందాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. ఈ మేరకు బ్యాంకర్లు చొరవ చూపుతూ ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా తోడ్పాటు అందించాలని సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం రుణమాఫీ అంశంపై బ్యాంకర్లతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రుణమాఫీ పథకం కింద మొదటగా రూ. లక్షలోపు పంట రుణాలు కలిగి ఉన్న రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం నిధులు జమ చేయనుందని, దీనివల్ల జిల్లాలో 44,469 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుందని కలెక్టర్ తెలిపారు. మరో పక్షం రోజుల్లో రూ. లక్షన్నర, రూ. రెండు లక్షల రుణాలు కలిగిన రైతులకు కూడా రుణమాఫీ నిధులను అందజేయనుందన్నారు. రుణమాఫీ కింద ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బులను నేరుగా రైతులు విత్ డ్రా చేసుకునేలా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రుణమాఫీ నిధులను పాత బకాయిలు, ఇతర రుణాల కింద మినహాయించుకోకూడదని, ఈ విషయాన్ని జిల్లావ్యాప్తంగా అన్ని బ్యాంకుల అధికారులకు తెలియజేయాలని సూచించారు. రుణమాఫీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయాన్ని పెంపొందించుకుని ఈ ప్రక్రియను సాఫీగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు వచ్చేలా చూడాలని చెప్పారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సంకేత్, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్ చవాన్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల అవస్థలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో గల నాలెడ్జ్ పార్క్ స్కూల్ సెంటర్‌లో గురువారం డీఎస్సీ పరీక్షలు ప్రారంభమవగా అభ్యర్థులు అవస్థలు పడ్డారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పరీక్షకు అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష సమయంలో చుట్టూ పక్కల నుంచి లౌడ్ స్పీకర్ల నుంచి భారీ శబ్దాలు రావడంతో ఇబ్బందులు పడ్డారు. గదులు చిన్నగా ఉండడం, సిబ్బంది, టీచర్లు సెంటర్‌లోనే కలియతిరగడంతో ఇబ్బందులకు గురయ్యారు. పరీక్ష కేంద్రం తనిఖీ చేయడానికి వచ్చిన డీఈవో దుర్గాప్రసాద్‌కు అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. అధిక శబ్దంతో ఇబ్బందులు పడుతున్నామని తెలుపడంతో డీఈవో స్పీకర్లను బంద్ చేయించారు. అలాగే కేంద్రంలోకి పాఠశాల సిబ్బంది, టీచర్లు రావొద్దని హెచ్చరించారు.



గోదావరికి జలకళ

రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమం వద్ద గోదావరి నదిలో వరద నీటి ప్రవాహం పెరుగుతోంది. తెలంగాణ, మహారాష్ట్రలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షం నీరు నదిలోకి చేరుతోంది. ఎగువ గోదావరి, మంజీర నదుల నుంచి వస్తున్న వరదతో త్రివేణి సంగమ ప్రాంతం జలకళను సంతరించుకుంటోంది. నదిలోని పురాతన శివాలయాన్ని ఆనుకుని వరద నీరు దిగువకు వెళ్తోంది. – రెంజల్(బోధన్)

స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- విద్య, వైద్య రంగాల పనితీరు పర్యవేక్షించాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: మండల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. వారంలో రెండు రోజులు తప్పనిసరిగా మండలాలను సందర్శించాలని, ముఖ్యంగా విద్య, వైద్య రంగాల పనితీరును నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం మండల ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్, వసతి గృహాలు, ఆస్పత్రులు, పీహెచ్‌సీలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించాలన్నారు. లోటుపాట్లు ఉంటే తమ దృష్టికి తేవాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా, డయేరియా, డెంగ్ వంటి వ్యాధులు సోకితే, అలాంటి ప్రాంతాల్లో విస్తృతస్థాయిలో నివారణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వ్యాధులు వ్యాప్తి చెందేందుకు కారణమయ్యే పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా శానిటేషన్ వ్యవస్థ, తాగునీటి సరఫరా తీరుతెన్నులను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల, హాస్టళ్లలో విద్యార్థులతో పాటు బోధన, బోధనేతర సిబ్బందికి, మధ్యాహ్న భోజనం తయారు చేసే వారికి కూడా హెల్త్‌చెకప్ చేయించాలని, దీనివల్ల సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా నివారణ చర్యలు చేపట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ బడుల్లో అమ్మ ఆద ర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పను లు పరిశీలించి రెండ్రోజుల్లోపు నివేదికలు అందించాలని గడువు విధించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ పాల్గొన్నారు.

తెయూ డిగ్రీ ఫలితాలు విడుదల

- 44.41 శాతం ఉత్తీర్ణత
- ప్రతిభ చాటిన బాలికలు



తెయూ డిగ్రీ ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి, కంట్రోలర్ అరుణ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ (2021–2024) ఫలితాలు గురువారం సాయంత్రం విడుదల అయ్యాయి. వర్సిటీ రిజిస్ట్రార్ ఎం.యాదగిరి తన చాంబర్‌లో కంట్రోలర్ ఎం.అరుణ, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్‌లతో కలిసి ఫలితాలను విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో 2024 మే 21 నుంచి జూన్ 15 వరకు జరిగిన డిగ్రీ పరీక్షల్లో మొత్తం 8,930 మంది విద్యార్థులు హాజరు కాగా 44.41 శాతంతో 3,966 మంది ఉత్తీర్ణులైనట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఇందులో బాలురు 27.93 శాతం ఉత్తీర్ణులు కాగా, బాలికలు 55.66 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. డిగ్రీ ఫలితాల్లో బాలురపై బాలికలేపై చేయి సాధించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ సాయిలు, డాక్టర్ నందిని, డాక్టర్ శాంతాబాయి, పీఆర్‌వో ఏ.పున్నయ్య, ప్రోగ్రామర్లు సతీశ్, విజయ్, సందీప్ పాల్గొన్నారు.

నాకేమైనా జరిగితే వారిదే బాధ్యత

- డీఈవో దుర్గాప్రసాద్



నిజామాబాద్ అర్బన్: తనకు ఏదైనా జరిగితే డీటీఎఫ్ సంఘానికి చెందిన నాయకులదే బాధ్యత అని డీఈవో దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రిటైర్డ్ టీచర్ శంతన్, డీటీఎఫ్ నాయకులు బాలయ్య, ఓమాజీ కొన్ని రోజులుగా తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఈ నెల 1న రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతులకు సంబంధించి వ్యక్తిగతంగా విమర్శలు చేస్తూ తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగతంగా, పరుష పదజాలంతో విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయని, డీఈవో డబ్బులు తీసుకున్నారని రిటైర్డ్ టీచర్ శంతన్ ఆరోపించారు. దీంతో డీఈవో ఈ ప్రకటన విడుదల చేశారు. అనంతరం డీఈవో ప్రకటనపై శంతన్ స్పందించారు. అక్రమాలపై విచారణ జరిపించాలని కోరితే డీఈవో ఇలా ప్రకటన చేయడం సరికాదన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న బ్యాక్‌లాగ్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ వన్‌టైం ఛాన్స్ బ్యాక్‌లాగ్ 5, 6వ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా కొనసాగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్ (కామారెడ్డి), ఎస్ఆర్ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (ఆర్మూర్) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 181 మంది విద్యార్థులకు గాను 172 మంది హాజరు కాగా, 9 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 97 మంది విద్యార్థులకు గాను 93 మంది హాజరు కాగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

పీజీ పరీక్షాకేంద్రం తనిఖీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ ఇంటిగ్రేటెడ్, పీజీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్న అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ గురువారం తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ పరీక్షా కేంద్రాన్ని తెయూ ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి తనిఖీ చేశారు. పీజీ ఇంటిగ్రేటెడ్ 6, 8, 7, 9, 10వ సెమిస్టర్, పీజీ 1, 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో ఉదయం 104 మంది విద్యార్థులకు గాను 102 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 158 మంది విద్యార్థులకు గాను 142 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరైనట్లు ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు.

'ఎంఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి'

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఎంఈడీ 2, 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజును ఈ నెల 26 వరకు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 31వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని కంట్రోలర్ సూచించారు.

ఐటీఐలలో ప్రవేశానికి గడువు పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ ఐటీఐలలో అడ్మిషన్ల గడువు తేదీని పొడిగించినట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ యాదగిరి గురువారం ఒక ప్రకటనలు తెలిపారు. రెండో విడతలో భాగంగా అడ్మిషన్ల గడువును ఈనెల 21 తేదీ వరకు పొడగించామని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఐదు ప్రభుత్వ ఐటీఐలో 1028 సీట్లు, మూడు ప్రైవేట్ ఐటీఐలలో 488 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మెరిట్ రూల్ ఆఫ్ రిజర్వేషన్, వెబ్ ఆప్షన్ ఆధారంగా సీట్లు కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 99481 95654 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

108,102 వాహనాల తనిఖీ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని 108, 102 వాహనాలను డీపీఎం రవి గురువారం తనిఖీ చేశారు. వాహనాలలోని సామగ్రిని పరిశీలించారు. 102 వాహనం ద్వారా గర్భిణులకు సకాలంలో వైద్య సేవలకు అందించాలని అన్నారు. సిబ్బంది సంగాగౌడ్, విజయ్‌క పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ సంకల్పం



సాలూరలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



బోధన్‌లో నిర్వహించిన హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నాం
- బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి
- సాలూర, బోధన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

బోధన్: రైతు సంక్షేమమే ప్రభుత్వ సంకల్పమని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. రైతు ఆర్థికంగా బలోపేతమైతే ఇతర వ్యాపార, వాణిజ్య రంగాల అభివృద్ధికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సాలూర మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో 63 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల పంటరుణమాఫీని అమలు చేస్తున్నామని, తొలి విడుతగా రూ.లక్ష రుణ మాఫీ జరుగుతోందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.లక్ష పంట రుణ మాఫీ హామీ అమలు తీరు రైతులు నష్టపోయారని విమర్శించారు. ఈ నెల 30 వరకు రూ.లక్షన్నర, ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల పంట రుణాలున్న రైతులందరికీ మాఫీ అవుతాయని తెలిపారు. తన హయాంలో నిర్మించిన ఎత్తిపోతల పథకంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. నియోజక వర్గం పరిధిలోని 500 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం పట్టణంలోని ఆచన్‌పల్లి వద్ద అప్నా ఫంక్షన్ హాల్‌లో బోధన్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

పాఠశాలల బలోపేతంపై దృష్టి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించే లక్ష్యంతో మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి ముందు ఉమ్మడి మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశమై, పాఠశాలల స్థితిగతులపై చర్చించారు. పాఠశాలల వారీగా మౌలిక సౌకర్యాలు, టీచర్లు, విద్యార్థుల సంఖ్య, పదో తరగతి పరీక్ష ఫలితాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే పదోతరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి పాఠశాల 75 శాతానికి తక్కువ కాకుండా ఉత్తీర్ణత సాధించాలని, పిల్లల సంఖ్యను పెంచాలని హెచ్‌ఎంలకు సూచించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్లు రమేశ్, గంగాధర్, ఎంఈవో నాగ్‌నాథ్, నాయకులు గడుగు గంగాధర్, గంగాశంకర్, అల్లె రమేశ్, మందర్న రవి, నాగేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆశా వర్కర్లు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతినెలా రూ.18 వేల వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వడంతో పాటు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగర ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్‌పై రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్‌కు మెయిల్ ద్వారా పలువురు ఫిర్యాదు చేశారు. మూడో కల్లుడిపో పరిధిలోని కల్లు బట్టీలు(షాపులు) ఒక చోట ఉండాల్సినవి మరో చోట ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జనావాసాల మధ్య కల్లుదుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డిపో సభ్యులకు ఎస్‌హెచ్‌వో వత్తాసు పలుకుతున్నారని ఫిర్యాదు చేశారు. మూడో డిపోకు గాయత్రినగర్‌లో దుకాణాన్ని కేటాయిస్తే కోటగల్లీలో, అలాగే న్యాల్‌కల్ రోడ్డులోని రేడియోస్టేషన్ వద్ద కేటాయిస్తే శివాజీనగర్‌లో దుకాణాలను ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డిపో సభ్యుల సమావేశం..

ఇదిలా ఉండగా, నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న మూడో కల్లు డిపోలో గురువారం సమావేశం నిర్వహించగా 54 మంది సభ్యులకు గాను కేవలం 24 మంది మాత్రమే హాజరయ్యారు. డిపో నిర్వహణపై ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో వారం రోజులుగా కల్లుడిపోలో జరుగుతున్న పరిణామాలపై సమావేశంలో చర్చించారు. తమ డిపోపై వస్తున్న ఫిర్యాదులపై స్పందించొద్దని కోరుతూ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేయాలని సమావేశంలో తీర్మానించారు. ఇందులో భాగంగా వినతిపత్రం అందజేసేందుకు ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లగా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి డిపో సభ్యులను లోనికి అనుమతించలేదు. దీంతో ఇన్‌వార్డులో వినతి పత్రం అందజేసి వెనుదిరిగారు. ఈ విషయమై ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా.. మూడో డిపో సభ్యులు రాగా, వినతిపత్రాన్ని ఇన్‌వార్డులో అందజేయాలని సూచించినట్లు తెలిపారు.



మూడో కల్లు డిపోలో సమావేశమైన గీత కార్మికులు

రిటైర్మెంట్ వయసును పొడిగించాలి

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యారంగంలో పని చేస్తున్న యూనివర్సిటీ అధ్యాపకుల రిటైర్మెంట్ వయస్సును యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధనల ప్రకారం 60 నుంచి 65 ఏళ్లకు పెంచాలని తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) అధ్యక్షుడు డాక్టర్ ఏ పున్నయ్య డిమాండ్ చేశారు. గురువారం తెయూ క్యాంపస్‌లో నిర్వహించిన టూటా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దకాలంగా పాలకులు ప్రభుత్వ విద్యారంగం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఉన్నత విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. మానవ వనరుల అభివృద్ధియే రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా ఉంటుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వర్సిటీల అధ్యాపకుల పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచాలని, అన్ని యూనివర్సిటీల్లో బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీ అధ్యాపకులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, వర్సిటీల ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టూటా కార్యవర్గ సమావేశంలో చేసిన తీర్మానాలను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశానికి పంపించాలని కోరుతూ రిజిస్ట్రార్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. టూటా ప్రధాన కార్యదర్శి మోహన్‌బాబు, ఉపాధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, రాజేశ్వరి, కార్యదర్శులు బాలకిషన్, నీలిమ, కోశాధికారి నాగరాజు, ఈసీ మెంబర్లు ప్రసన్న రాణి, జమీల్ పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టూటా అధ్యక్ష, కార్యదర్శులు పున్నయ్య, మోహన్‌బాబు

ఎస్సారెస్పీకి 26వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వ

- ఎగువ నుంచి పెరిగిన వరద
- క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం

బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు పెరిగింది. 26వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ సీజన్‌లో ఇదే ఎక్కువ ఇన్‌ఫ్లో. ఉదయం 6,600 క్యూసెక్కుల వరద రాగా, మధ్యాహ్నానికి 8,700 క్యూసెక్కులకు పెరిగింది. సాయంత్రానికి ఇన్‌ఫ్లో మరింత పెరిగి 12,500 క్యూసెక్కుల నీరు నిలకడగా వచ్చి రాత్రి వరకు 26వేల క్యూసెక్కులకు పెరిగింది. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొంటున్నారు. సరస్వతీ కాలువకు 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 206 క్యూసెక్కులు ఆవిరి రూపంలో పోతోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80టీఎంసీలు) అడుగులు కాగా గురువారం రాత్రి వరకు 1064.50(15.40 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. గతేడాది ఇదే రోజున 1070.90(24.79టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

పరిశోధక విద్యార్థికి డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగం పరిశోధక విద్యార్థి ప్రకాశ్ డాక్టరేట్ సాధించారు. తెయూ రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ జి.ప్రవీణాబాయి పర్యవేక్షణలో 'శతృఘ్నకుమార్ కే సాహిత్య్ మే బహుజన చేతనాకా విశ్లేషణాత్మక్ అధ్యయన్' అనే అంశంపై ప్రకాశ్ పరిశోధన నిర్వహించి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మినీ సెమినార్ హాల్‌లో గురువారం నిర్వహించిన ఓపెన్ వైవా వోస్‌కు ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ, హైదరాబాద్ ప్రొఫెసర్ శ్యాంరావు రాథోడ్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ, ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కే లావణ్య, హిందీ విభాగాధిపతి ఎండీ జమీల్ అహ్మద్, అధ్యాపకులు పార్వతి, అబ్దుల్ ఖవి, గుల్-ఎ-రాణా, మూసా ఖురేషీ, నాగరాజు, కాంట్రాక్టు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాస్‌నగర్ ఘటనలో గాయపడిన
గురుకుల విద్యార్థిని మృతి

- ఘటనా స్థలంలో తల్లి, ఆస్పత్రిలో పరిస్థితి విషమించి కూతురు మృతి
- చిన్నమావందిలో విషాదఛాయలు



ఈశ్వరి (ఫైల్)

బోధన్‌రూరల్/నిజామాబాద్ నాగారం: మాక్లూర్ మండలం దాస్‌నగర్ వద్ద కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్రగాయాలపాలైన మహాత్మా జ్యోతిబా పూలే గురుకులం విద్యార్థిని శ్రీరాం ఈశ్వరి(13) కన్నుమూసింది. ఈనెల 14న జరిగిన ఘటనలో గాయపడిన ఈశ్వరిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. ప్రమాదం జరిగిన రోజున ఘటనాస్థలంలో ఈశ్వరి తల్లి పద్మ మృతి చెందగా, ఆమె సోదరి గౌతమికి స్వల్ప గాయాలైన విషయం తెలిసిందే. తల్లీ కూతుళ్ల మృతితో బోధన్ మండలం చిన్నమావందిలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్షలు ఖర్చు చేసి ఆపరేషన్ చేయించినా తమ బిడ్డ ప్రాణాలను కాపాడలేకపోయామని తండ్రి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయసహకారాలు అందలేదని, అడిషనల్ కలెక్టర్ వచ్చి పరామర్శించిన వెళ్లినా.. ఈశ్వరికి చికిత్సకు ఎలాంటి ఆర్థిక సహాయం ప్రభుత్వం నుంచి అందలేదని చిన్నమావంది గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈశ్వరి అంత్యక్రియలను గ్రామంలో పూర్తి చేశారు.

తెయూ హాస్టల్ భోజనంలో పురుగు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థినులు గురువారం రాత్రి భోజనం చేస్తుండగా, ఓ విద్యార్థిని వేసుకున్న అన్నం, సాంబార్‌లో పురుగు రావడంతో ఆందోళన గురైంది. ఈనెల 21న విద్యార్థులకు అందించిన అల్పాహారం (టిఫిన్)లో బల్లి వచ్చిన ఘటనను మరువకముందే భోజనంలో పురుగు కనిపించడం కలకలం రేపింది. తాను చేస్తున్న భోజనం పురుగు వచ్చిన విషయాన్ని విద్యార్థిని తోటి విద్యార్థినులకు తెలుపడంతో వారంతా భోజనం చేయడం మానేసి వార్డెన్ కిరణ్మయికి సమాచారం అందించారు. హాస్టల్‌కు చేరుకున్న వార్డెన్ భోజనాన్ని పరిశీలించి వివరలు తెలుసుకున్నారు. శుక్రవారం రిజిస్ట్రార్ యాదగిరితో కలిసి హాస్టల్ వంట మనుషులను హెచ్చరిస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వార్డెన్ విద్యార్థినులను సముదాయించారు. భోజనం చేయకుండా ఉన్న విద్యార్థినుల కోసం టమాట రైస్ తయారు చేయించారు. భోజనంలో పురుగు వచ్చిన విషయమై విద్యార్థినులు ఫోన్‌లో రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. హాస్టల్ వార్డెన్, కేర్‌టేకర్ల నిర్లక్ష్యం కారణంగానే భోజనంలో తరచూ బల్లులు, పురుగులు, కీటకాలు వస్తున్నాయని విద్యార్థినులు ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోనిపక్షంలో రిజిస్ట్రార్ చాంబర్‌ను ముట్టడిస్తామన్నారు. ఈ ఘటనపై తెయూ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డిని వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.



తెయూ బాలికల హాస్టల్ భోజనంలో వచ్చిన పురుగు

విచారణ చేపడతాం

క్యాంపస్‌లో ఓల్డ్ బాయ్స్ హాస్టల్, న్యూ బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్ ఉండగా కేవలం గర్ల్స్ హాస్టల్‌లోనే ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. గర్ల్స్ హాస్టల్‌లో పలువురు విద్యార్థినులు మెస్ డిపాజిట్, మెస్ బిల్లులు బకాయిలు చెల్లించాల్సి ఉంది. హాస్టల్ అధికారులు మెస్ బకాయిలు, డిపాజిట్‌లు చెల్లించాలని అడుగుతుండడంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అనిపిస్తోంది. గత నెలలోనే అల్పాహారంలో కీటకం వస్తే వంట మనిషిని సస్పెండ్ చేశాం. ఇప్పుడు మళ్లీ సాంబార్‌లో పురుగు వచ్చిందని చెబుతున్నారు. ఈ ఘటనపై శుక్రవారం విచారణ చేపడతాం.

– రిజిస్ట్రార్ యాదగిరి

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

- దోమకొండ మండలం ముత్యంపేటలో విషాదఛాయలు

దోమకొండ: మండలంలోని ముత్యంపేటలో గురువారం ఇద్దరు వ్యక్తులు వేర్వేరు కారణాలతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఒకేరోజు ఇద్దరు ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్న బండారి వెంకటస్వామి(53) గతంలో ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు చేశాడు. ఇటీవల కుమారుడికి యాక్సిడెంట్ కావడంతో చికిత్స కోసం అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మీనర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై మరొకరు..

గొర్లు కాస్తూ జీవించే గ్రామానికి చెందిన నంగి రాజయ్య (55) మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంటికి సమీపంలోని కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మృతి



బాలయ్య మృతదేహం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): భవనం పైనుంచి ప్రమాదవశాత్తు పడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మండల కేంద్రంలో సలీం అనే వ్యక్తి ఇంటి నిర్మాణ పనులకు వచ్చిన రొడ్డ బాలయ్య (57) ఈనెల 17న రెండో అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. వెంటనే అతడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు..



ఎజాజ్(ఫైల్)

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ శివారులో బైక్.. టాటా ఏస్ ఢీకొన్న ఘటనలో ఎజాజ్ (30) గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాటుసారా స్వాధీనం



నాటుసారాను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

సిరికొండ: మండలంలోని వర్జన్‌తండా, చీమ్యానాయక్ తండా, ఒంటిప్పతండా, గోప్యానాయక్ తండాలపై గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసినట్లు భీమ్‌గల్ ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్‌రావు తెలిపారు. ఆయా తండాల్లో 11 లీటర్ల నాటుసారా, ఇప్పపువ్వుతోపాటు 50లీటర్ల బెల్లం వాష్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నాటు సారా తయారు చేస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ రవీందర్‌రావు ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విలాస్, సిబ్బంది పాల్గొన్నట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



ఎడపల్లి (బోధన్): మండలంలోని కుర్నాపల్లి శివారులో అబ్బయ్య దర్గా వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్లను రైతులు ధ్వంసం చేశారు. గురువారం ఉదయం గ్రామానికి చెందిన రైతులు పంటపొలాల్లోకి వెళ్లేసరికి ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు అందులో నుంచి కాపర్‌ను ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంట పొలాలకు నీరందించడానికి ఇబ్బందులు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మట్కా నిర్వాహకుల పట్టివేత



బోధన్‌టౌన్(బోధన్): ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని పట్టణంలో గురువారం అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం అందగా, సీపీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.8,650 నగదు స్వాధీనం చేసుకొని పట్టణ సీఐ వీరయ్యకు అప్పగించినట్లు తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి, సీఐ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ ..

రుద్రూర్: మంజీరా నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పొతంగల్ చెక్‌పోస్టు సమీపంలో పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి ఆపి తనిఖీ చేయగా.. ఎలాంటి అనుమతి లేనట్లు నిర్ధారణ కావడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం అందించామన్నారు.

మోటార్ సైకిల్ చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద నుంచి దుండగులు మోటార్ సైకిల్‌ను ఎత్తుకెళ్లినట్లు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. ఆర్టీసీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న రామేశ్వర్‌పల్లికి చెందిన పైతరి యాదగిరి బుధవారం ఉదయం టోల్ ప్లాజా వద్ద వాహనాన్ని నిలిపి డ్యూటీకి వెళ్లాడు. తిరిగి రాత్రి టోల్‌ప్లాజా వద్దకు రాగా వాహనం కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి హత్య కేసులో ఒకరికి జీవితఖైదు

ఖలీల్‌వాడి: వృద్ధురాలి హత్య కేసులో ఆర్మూర్ మండలం ఆలూర్ గ్రామానికి చెందిన వెంకటికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు వెలువరించారు. 2008 సంవత్సరంలో నమోదైన కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆలూర్‌కు చెందిన కొత్తూరు గంగు(65) తన ఇంటి సమస్యలను గ్రామానికి చెందిన అన్రాసి వెంకటికి చెప్పుకునేంది. ఈ క్రమంలో వెంకటి కన్ను వృద్ధురాలి నగలపై పడింది. మంత్రాలతో నీ సమస్యలను దూరం చేస్తానని గంగును వెంకటి నమ్మించాడు. ఆమె కోడలు పుష్ప బంధువుల ఇంటికి వెళ్లిన సందర్భంలో తన స్నేహితుడు కడమంచి సురేశ్‌తో కలిసి గంగు ఇంటికి వెళ్లిన వెంకటి ఆమెను బైక్‌పై శ్రీరామ్‌సాగర్ బ్యాక్ వాటర్ గ్రామమైన మగ్గిడి శివారు ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై పసుపు, కుంకుమ చల్లిన వెంకటి.. నీటిలో మునిగిరావాలని సూచించగా, గంగు నీటిలోకి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన ఇద్దరు నిందితులు ఆమె గొంతుకు చీరచుట్టి బలంగా లాగి హత్య చేశారని పోలీసులు కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలు రుజువుకావడంతో ప్రథమ ముద్దాయి వెంకటికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. రెండో ముద్దాయి సురేశ్ తరఫున డిఫెన్స్ న్యాయవాది జీవీ కృపాకర్‌రెడ్డి వాదనలను వినిపించారు. తన క్లైంట్‌కు హత్య, దోపిడీ, సాక్షాల తారుమారుతో సంబంధం లేదని విన్నవించగా, న్యాయవాది వాదనలతో ఏకీభవించిన కోర్టు సురేశ్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ నిర్వహించి బైక్‌లుచోరీకి పాల్పడుతున్న ఒకరిని అరెస్ట్ చేశామని ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. నిందితుడి నుంచి మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన చమన్ నరేశ్ అనుమానాస్పదంగా వ్యవహరించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా, బైక్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. బుధవారం టోల్‌ప్లాజా వద్ద నుంచి సైతం బైక్‌ను ఎత్తుకెళ్లానని, కామారెడ్డిలో మరో రెండు బైక్‌లను చోరీ చేశానని తెలిపాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై సాయికుమార్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

బాన్సువాడ: తప్పిపోయిన బాలుడిని బాన్సువాడ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. పిట్లం మండలం తిమ్మనగర్‌కు చెందిన దేవసోత్ రేణుక బాన్సువాడలోని తన సోదరుడి ఇంటికి వచ్చింది. తన కుమారుడు చంద్రకాంత్(2)ను అక్కడే వదిలి షాపింగ్‌కు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి బాలుడు కనిపించలేదు. కాగా పట్టణంలోని బీసీ హాస్టల్ రోడ్డులో బాలుడు ఒంటరిగా కనిపించడంతో స్థానికులు పోలీసులకు అప్పగించారు. చంద్రకాంత్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బాలుడి తల్లిదండ్రులు స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లారు.